## మెడికల్ కాలేజీల్లో పోస్ట్-డాక్టొరల్ ఫెలోషిప్ కోర్సులు

- తొలిసారి ప్రవేశపెట్టిన నేషనల్ మెడికల్ కమిషన్
- వైద్య రంగంలో పరిశోధనలను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యం



న్యూఢిల్లీ, జనవరి 5: వైద్య రంగంలో పరిశోధనలను ప్రోత్సహించడంతోపాటు క్లినికల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తొలిసారి తన నియంత్రణలో ఉన్న మెడికల్ కాలేజీల్లో పోస్ట్-డాక్టొరల్ ఫెలోషిప్ కోర్సులను ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు వైద్య విద్యా సంస్థలే సొంతగా ఇలాంటి కోర్సులను రూపొందించి, ఆమోదించేవి. ఈ నేపథ్యంలో ఎన్ఎంసీ ఇటీవల 'పోస్ట్-గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్-2023'ను నోటిఫై చేసింది. ఈ నిబంధనల ప్రకారం ఏదైనా మెడికల్ కాలేజీలో పీజీ కోర్సును లేదా సీట్లను ప్రారంభించేందుకు అనుమతించిన తర్వాత ఆ కోర్సు గుర్తింపు పొందినట్టుగా పరిగణిస్తారు. దీంతో పోస్టుగ్రాడ్యుయేట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తర్వాత డిగ్రీని రిజిస్టర్ చేసుకోవడంలో విద్యార్థులకు ఎదురవుతున్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎన్ఎంసీ ఆధ్వర్యంలోని పోస్టు-గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ ఓజా వివరించారు. పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ (సవరణ) నిబంధనలు-2018 స్థానంలో నోటిఫై చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. పీజీ అడ్మిషన్ల కోసం ప్రతిపాదించిన నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్) అమలులోకి వచ్చే వరకు ప్రస్తుత నీట్-పీజీ పరీక్ష కొనసాగుతుంది.

## మరాఠా కోటా కోసం మరో యువకుడి ఆత్మహత్య

ముంబై, జనవరి 5 (నమస్తే తెలంగాణ): మరాఠా రిజర్వేషన్ల కోసం జరుగుతున్న ఆత్మహత్యలు ఆగడం లేదు. మహారాష్ట్ర కళంబా తాలూకా దహీఫాల్‌లో రోహన్ రాజేంద్ర భటల్వాండే (19) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం జరిగిన ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రాజేంద్ర వ్యవసాయంలో డిప్లొమా కోర్సు చేశాడు. ఉద్యోగం కోసం వెతికినా ఎక్కడా దొరకలేదు. గ్రామంలో పాల డెయిరీ వ్యాపారం ప్రారంభించాడు. పాల వ్యాపారం చేస్తూనే మూడు ఆవులను స్వయంగా పోషించుకుంటున్నాడు. వ్యవసాయంలో డిగ్రీ చదివితే ప్రయోజనం ఏమిటి..? ఉద్యోగావకాశాలు దొరకని చోట రిజర్వేషన్ ఉంటే కొంత అవకాశం వచ్చేదని, ప్రభుత్వం మేల్కొని మరాఠాలకు రిజర్వేషన్లు ప్రకటించాలని ఓ చీటీ రాసి రోహన్ ఉరివేసుకున్నారు. పంచనామా సందర్భంగా జేబు లో మరాఠా రిజర్వేషన్ డిమాండ్ నోట్ దొరికిందని యెర్మలా థాణే అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అతుల్ పాటిల్ తెలిపారు.

## సుప్రీంకోర్టులో విస్కీ బాటిళ్లు.. అవాక్కయిన సీజేఐ

న్యూఢిల్లీ: సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గి శుక్రవారం సుప్రీంకోర్టు ధర్మాసనం సమక్షంలో రెండు విస్కీ బాటిళ్లను పెట్టడంతో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ అవాక్కయ్యారు. పెర్నోడ్ రికార్డ్ కంపెనీ, జేకే ఎంటర్‌ప్రైజెస్ మధ్య జరుగుతున్న ట్రేడ్‌మార్క్ వివాదంలో మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పుపై దాఖలైన అప్పీలు విచారణ సందర్భంగా ఈ సంఘటన జరిగింది. ఈ అప్పీలును దాఖలు చేసిన పెర్నోడ్ రికార్డ్ కంపెనీ తరపున ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. 'లండన్ ప్రైడ్' పేరుతో మద్యాన్ని తయారు చేయకుండా జేకే ఎంటర్‌ప్రైజెస్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ అప్పీలుపై విచారణ ప్రారంభమైన వెంటనే ముకుల్ రోహత్గి మాట్లాడుతూ, ప్రొడక్ట్స్‌ను కోర్టులోకి తేవడానికి అనుమతించాలని కోరారు. అనంతరం రెండు విస్కీ బాటిళ్లను ధర్మాసనం సమక్షంలో పెట్టారు. వాటిని చూసిన సీజేఐ చంద్రచూడ్ స్పందిస్తూ, 'మీతో పాటు బాటిల్స్‌ను తీసుకొచ్చారా?' అని అడిగారు. రోహత్గి బదులిస్తూ, ఈ రెండు ప్రొడక్ట్స్ మధ్య సారూప్యతలను చూపించవలసి ఉందని చెప్పారు. ట్రేడ్‌మార్క్ చట్టాల ఉల్లంఘన ఏవిధంగా జరిగిందో వివరించారు. అనంతరం హైకోర్టు తీర్పును నిలిపేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# నేడు ఎల్1 కక్ష్యలోకి ఆదిత్య

### ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

- జేఎన్‌టీయూహెచ్ 12వ స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరు
- సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన జేఎన్‌టీయూ

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సూర్యుడి రహస్యాల గుట్టు విప్పేందుకు ప్రయోగించిన ఆదిత్య ఎల్1 శాటిలైట్‌ను శనివారం సాయంత్రం 4 గంటలకు లాగ్రాంజ్ పాయింట్ 1 కక్ష్యలోకి ప్రవేశపెడుతామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడించారు. హైదరాబాద్ జేఎన్‌టీయూలో శుక్రవారం నిర్వహించిన 12వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమనాథ్‌కు జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతరం సోమనాథ్ మీడియాతో మాట్లాడుతూ.. సొంత సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగించిన ఆదిత్య ఎల్1 విజయవంతంగా దూసుకుపోతున్నదని పేర్కొన్నారు. ఈ నెల లేదా ఫిబ్రవరి మొదటి వారంలో వాతావరణానికి సంబంధించిన ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించనున్నట్టు వెల్లడించారు. గగన్‌యాన్ ప్రయోగం కోసం కూడా సన్నాహాలు కొనసాగుతున్నాయని, 2024 గగన్‌యాన్ సంవత్సరం కాబోతుందని చెప్పారు. అంతరిక్ష రంగంలో విజయాల నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచమే భారత్ వైపు చూస్తున్నదని సోమ్‌నాథ్ అన్నారు. జీవితంలో అపజయాలు, ఒడిదొడుకులు సహజమని, అపజయాల నుంచే పాఠాలు నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. నేటికాలం ఆలోచనలకు అనుగుణంగా యూనివర్సిటీల్లో కూడా కొత్త కోర్సులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జేఎన్‌టీయూకు టెక్నాలజీ సాయం అందించడంలో ఇస్రో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో కలిసి వీసీ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ గోవర్ధన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ ఆధ్వర్యంలో దాదాపు 88,226 మందికి పట్టాలు ప్రదానం చేశారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీలలో 54 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. 142 మందికి పీహెచ్‌డీ పట్టాలు అందచేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై హాజరు కాలేదు. అయితే ఆమె మొబైల్ సందేశం ద్వారా విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



శుక్రవారం జేఎన్‌టీయూ కూకట్‌పల్లిలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి.. చిత్రంలో రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్‌హుస్సేన్

## ఫ్యూయల్ సెల్ పరీక్ష విజయవంతం

బెంగళూరు, జనవరి 5: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఫ్యూయల్ సెల్‌ను విజయవంతంగా పరీక్షించింది. జనవరి 1న చేసిన ఈ ప్రయోగంలో భాగంగా.. రసాయన చర్య జరిపిన ఫ్యూయల్ సెల్ కేవలం నీటినే బై ప్రొడక్ట్‌గా విడుదల చేసిందని ఇస్రో వెల్లడించింది. హైడ్రోజన్, ఆక్సిజన్ నుంచి రసాయన చర్య జరిపి 180 వాట్ల శక్తిని విడుదల చేసిందని తెలిపింది. భవిష్యత్తులో అంతరిక్ష కేంద్రాల్లో వాడే విద్యుత్తు ఉత్పత్తి కోసం అభివృద్ధి చేసిన ఈ ఫ్యూయెల్ సెల్ పనితీరుకు సంబంధించిన డాటాను సేకరించామని, దానితో పూర్తిస్థాయి పనితీరును విశ్లేషిస్తామని వెల్లడించింది.

### చవకైన బ్యాటరీ

అత్యంత సామర్థ్యం, అతి చవకైన బ్యాటరీని కూడా ఇస్రో పరీక్షించింది. భవిష్యత్తు మిషన్ల కోసం దీన్ని అభివృద్ధి చేశామని, ప్రస్తుతం ఉపయోగిస్తున్న లిథియం-అయాన్ బ్యాటరీలకన్నా తక్కువ బరువు, తక్కువ ధర అని వెల్లడించింది. ఇవి 10 ఏహెచ్ సిలికాన్ గ్రాఫైట్ ఆనోడ్ ఆధారిత బ్యాటరీలని వివరించింది.

## పృథ్వీ పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 5: భూ విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించి అయిదేండ్ల కాలపరిమితిలో వివిధ ఉప పథకాలకు కేటాయించిన నిధులు, పరిశోధనలన్నీ ఒకే పథకం ద్వారా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఆమోదం తెలిపింది. 'పృథ్వీ విజ్ఞాన్(పృథ్వీ)' గా పేర్కొన్న ఈ స్కీమ్ ద్వారా భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖకు కేటాయించిన రూ.4,797 కోట్ల నిధులను దేశీయ పరిశోధనలతో పాటు విదేశీ సంస్థల పరిశోధనల ప్రాజెక్టులకు కూడా కేటాయిస్తారు. 'వాయు మండలం, వాతావరణ పరిశోధన- పరిశీలన పద్ధతులు, సేవలు', 'సముద్ర సేవలు, విధానాలు, వనరులు, సాంకేతికత', 'ధ్రువాల విజ్ఞాన శాస్త్రం, భూమి ఉపరితలంలో నీరు గడ్డకట్టే పరిస్థితుల పరిశోధన', 'భూకంప శాస్త్రం, భూగోళ శాస్త్రం' ఉప పథకాలన్నీ ఇకపై ఒకే యూనిట్‌గా పృథ్వీ పథకం కింద పరిగణిస్తారు. ఈ పథకం వల్ల పరిశోధనలు చేయడం సులువవుతుందని కేంద్ర క్యాబినెట్ తెలిపింది.

## బంగ్లాదేశ్‌లో రైలుకు నిప్పు.. ఐదుగురు మృతి



బంగ్లాదేశ్‌లో ఆదివారం సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న వేళ పెద్దయెత్తున హింస చెలరేగింది. బెనపోల్ నుంచి ఢాకా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకు కొంతమంది దుండగులు నిప్పుపెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. సయిదాబాద్‌లోని గోపీబాఘ్ ఏరియాలో రైలుకు మంటలు అంటుకొన్న ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు మరణించారు. నాలుగు రైలు కోచ్‌లకు పెద్దయెత్తున మంటలు అలముకున్నాయి. అక్కడకు చేరుకొన్న అగ్నిమాపక దళాలు మంటలను ఆర్పివేశాయి. అగ్ని ప్రమాద ఘటనను విధ్వంసక చర్యగా అనుమానిస్తున్నట్టు పోలీసు చీఫ్ అన్వర్ హుస్సేన్ పేర్కొన్నారు. కాగా, ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ), పలు ఇతర పార్టీలు ఈ ఎన్నికలను బహిష్కరించిన నేపథ్యంలో తాజా ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

## సాంకేతికతతో 'హిట్ అండ్ రన్'కు పరిష్కారం

- కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జనవరి 5: ప్రమాదం జరిగిన వెంటనే ఆ విషయాన్ని అధికారులకు తెలియజేసే సాంకేతిక వ్యవస్థను ట్రక్కు డ్రైవర్లు వినియోగించుకునేందుకు అనుమతించాలని సూచించినట్టు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ సాంకేతికత వాడితే దానిని హిట్ అండ్ రన్ కేసుగా పరిగణించరాదని కోరామని, ఈ విషయం హోం మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్నందున తుది నిర్ణయం వారిదేనని పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే ఉంటే స్థానికుల, బాధితుల ఆగ్రహానికి గురికావచ్చు. లేదా ప్రమాద వాహనం నిప్పంటుకునే ప్రమాదం కలగవచ్చు. అలాంటప్పుడు తాము దాని గురించి పోలీసులకు ఎలా సమాచారమివ్వగలమని ట్రక్కు డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. అందుకనే ప్రమాదం జరిగిన వెంటనే సాంకేతిక వ్యవస్థ ద్వారా వెంటనే సమాచారమిచ్చి, 25-50 కిలోమీటర్లు వచ్చిన తర్వాత పోలీసులకు తెలియజేయవచ్చునని తాము సూచించామన్నారు.

## అంబేద్కర్, బుద్ధుడూ దైవాంశ సంభూతులే!

- వారి పేరున ప్రమాణం తప్పు కాదు: కర్ణాటక హైకోర్టు

బెంగళూరు: రాజ్యాంగం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం కాకుండా కొందరు వ్యక్తుల పేరిట శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయడంలోని పవిత్రతను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. అంబేద్కర్, బసవేశ్వర, బుద్ధుడు వంటి వారిని దైవాంశ సంభూతులుగా పరిగణిస్తారని, రాజ్యాంగంలోని మూడో షెడ్యూల్‌లో పేర్కొన్న 'గాడ్' అనే ఇంగ్లిష్ పదం కూడా ఇంచుమించు దీనినే సూచిస్తుందని ధర్మాసనం పేర్కొన్నది. అంతేకాకుండా దేవుడి పేరు ప్రస్తావించనక్కర్లేకుండా ప్రమాణం చేసేందుకు కూడా రాజ్యాంగం అనుమతి ఉందని తెలిపారు.

## దావూద్ ప్లాట్‌కు వేలంలో భారీ మొత్తం

ముంబై: మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీంకు చెందిన నాలుగు స్థలాలను ప్రభుత్వం వేలం వేసింది. వీటిలో రెండింటికి బిడ్లు రాలేదు. ఒకదానికి కళ్లు చెదిరే ధర పలికింది. 170.98 చదరపు మీటర్ల విస్తీర్ణంగల ఈ స్థలానికి రిజర్వు ధర రూ.15,440 కాగా రూ.2.01 కోట్లకు న్యాయవాది అజయ్ శ్రీవాస్తవ కొన్నారు. ఈ ప్లాట్ సర్వే నెంబరు, ధరలను సంఖ్యాశాస్త్రం ప్రకారం పరిశీలించినపుడు తనకు అదృష్టం కలిసి వస్తుందని తెలిసిందని, అందుకే తాను భారీ మొత్తానికి ఈ స్థలాన్ని కొన్నానని చెప్పారు. ఈ స్థలంలో తాను సనాతన పాఠశాలను స్థాపిస్తానని చెప్పారు.

## నిరాశావాదుల కోసం హోటల్

టోక్యో: మానసిక ఒత్తిడి, నిరాశావాదంతో బాధపడేవారి కోసం జపాన్‌లోని టోక్యోలో ఓ హోటల్ ఉంది. మానసిక ఒత్తిడితో బాధపడుతున్న ఓ వ్యక్తి తనలాంటివారి కోసం 2020లో దీన్ని ఏర్పాటుచేశారు. నెగెటివ్ కెఫే అండ్ బార్ మోరి ఔచీ పేరిట టోక్యోలోని షిమోకిటాజవా శివారు ప్రాంతంలో దీనిని ఏర్పాటు చేశారు. నిరాశ కలిగించే ఆలోచనలు వచ్చేవారు ఇక్కడ సేదదీరవచ్చునని ఈ కెఫే ప్రకటనలో తెలిపారు. ఇక్కడికి మహిళలను ఒంటరిగా మాత్రమే అనుమతిస్తారు. పురుషులు ఇక్కడ సేదదీరాలంటే వారితో పాటు ఓ మహిళ తప్పనిసరిగా ఉండాలి.

